ప్రజాశక్తి
సోమవారం 23 సెప్టెంబర్ 2024
5
శ్రీ సత్యసాయి

రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి : సిఐటియు

కరపత్రాలను విడుదల చేస్తున్న కెవిపిఎస్ నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

అక్టోబర్ 8న జరిగే కాటికాపర్ల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు జెడ్‌పి. శ్రీనివాసులు, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రమణ పిలుపు నిచ్చారు. సదస్సుపై ఆదివారం పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో కాటికాపర్ల సంఘం జిల్లా అధ్యక్షులు గోపాలప్ప అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశానికి సిఐటియు జిల్లా అధ్యక్షులు జెడ్ పి శ్రీనివాసులు, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రమణలు పాల్గొని కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతు సదస్సు సందర్భంగా ఆర్ అండ్ బి అతిథిగృహం నుంచి పట్టణ పురవీధుల గుండా అంబేద్కర్ భవన్ వరకు ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ భవన్ లో సదస్సును ఏర్పాటు చేశామన్నారు. సదస్సులో కాటి కాపర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి, ఉద్యమ రూపకల్పన చేయడం జరుగుతుందన్నారు. సదస్సుకు కాటి కాపర్లు అందరు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య, కెవిపిఎస్ జిల్లా కమిటీ సభ్యులు రామాంజనేయులు, గంగాధర్, యోగానంద, గోపాలకృష్ణ, కోకిల నారాయణ, అనితమ్మ, రామాంజనమ్మ, సరస్వతి, భాగ్యమ్మ, నరసింహులు, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

వైసిపి హయాంలో ఇరిగేషన్ వ్యవస్థ నిర్వీర్యం

రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు

జీడిపల్లి జలాశయం వద్ద మంత్రి నిమ్మల, తదితరులు

ప్రజాశక్తి - అనంతపురం

వైసిపి హాయాంలో ఇరిగేషన్ వ్యవస్థ నిర్వీర్యం అయిందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు. బెలుగుప్ప మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్ వద్దనున్న పంప్ హౌస్‌ను రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి రామానాయుడు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాయలసీమలో ఇరిగేషన్ వ్యవస్థ అంతా నిర్వీర్యమై 20 సంవత్సరాల వెనక్కి వెళ్లిన పరిస్థితి ఉందన్నారు. దానికి ఉదాహరణగా హంద్రీనీవానే అని అన్నారు. అప్పటి తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు 3,850 క్యూసెక్కుల నీటి సామర్థ్యంతో హంద్రీనీవా ఎత్తిపోతలకు శ్రీకారం చుట్టి, దీనికి మచ్చుమర్రిని సమాంతరంగా నిర్మాణం చేసి రాయలసీమలో నాలుగు ఉమ్మడి జిల్లాలకు సంబంధించి హంద్రీనీవా ద్వారా తాగు, సాగునీరు అందించాలనే ఆలోచనతో పని చేశారన్నారు. అయితే ఇప్పుడు కాలువలో 1,800 నుంచి 1,900 క్యూసెక్కుల నీరు మాత్రమే వస్తున్న పరిస్థితి ఉందనానరు. గత ఐదేళ్లలో 3,850 క్యూసెక్కుల సామర్థ్యంతో నీరు వెళ్లాలని చేపట్టిన పనులను పూర్తి చేసి ఉంటే ఈరోజు పూర్తిస్థాయి సామర్థ్యంతో హంద్రీనీవా కాలువనుఉపయోగించుకునే పరిస్థితి ఉండేదన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో హంద్రీనీవాకు దాదాపు 4 వేల కోట్ల రూపాయలు 5 సంవత్సరాల్లో ఖర్చు పెడితే, 500 కోట్ల రూపాయలు కూడా గత ప్రభుత్వం హాయంలో ఖర్చుచేయలేదని విమర్శించారు. 60 టీఎంసీల నీటిని తీసుకోవాల్సిన హంద్రీనీవా కాలువ ఇప్పుడు 20, 25 టీఎంసీల నీటిని కూడా వాడుకోలేని పరిస్థితి ఉందన్నారు. దీన్నిదృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన ఆదేశాల ప్రకారం పూర్తి సామర్థ్యంతో హంద్రీనీవా పనిచేసే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. 3,850 క్యూసెక్కుల నీరు ప్రవహించేలా మెయిన్ కెనాల్ విస్తరణ చేపట్టి పూర్తి సామర్థ్యంతో హంద్రీనీవాని ఉపయోగించుకునే విధంగా ప్రణాళిక సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి ఇచ్చిన ఆదేశాల ప్రకారమే ఇరిగేషన్ ఉన్నతాధికారులు, తాము హంద్రీనీవా, మాల్యాల నుంచి దాదాపు 700 కిలోమీటర్లు కాలువ పరిశీలన చేసి ప్రాక్టికల్‌గా ఒక రిపోర్ట్ సిద్ధం చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా మంత్రి జీడిపల్లి రిజర్వాయర్ వద్దనున్న పంప్ హౌస్‌ను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, ప్రాజెక్ట్స్ సీఈ నాగరాజ, హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ ఎస్ఈ దేశే నాయక్, మైనర్ ఇరిగేషన్ ఎస్ఈ విశ్వనాథరెడ్డి, ఆర్డీవో రాణిసుస్మిత, హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ ఈఈ రాజా స్వరూప్ కుమార్, డిఈలు శ్రీనివాసులు నాయక్, రామచంద్ర మూర్తి, రాఘవేంద్రరావు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

తుంగభద్ర హెచ్‌ఎల్‌సి ఆధునీకరణ పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలి

మంత్రి నిమ్మలకు సిపిఎం నాయకుల వినతి

మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం రాష్ట్ర నాయకులు ఓబులు

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

అనంతపురం రాయలసీమ జిల్లాలకు ప్రాణధారగా నిలిచిన తుంగభద్ర హెచ్ ఎల్ సి ఆధునీకరణ పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని సిపిఎం రాష్ట్ర నాయకులు జి ఓబులు డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా పర్యటనకు వచ్చిన రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును, రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమను జిల్లా ప్రజా ప్రతినిధులను సిపిఎం జిల్లా ప్రతినిధి బృందం కలిసి వినతి పత్రం అందజేసింది. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర నాయకులు జి ఓబులు మాట్లాడుతూ అనంతపురము జిల్లా జలవనరుల అభివృద్ధి పనులు, తాగు నీరు సాగునీరు కొరకు తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు జి.ఓబులు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బాలరంగయ్య, జిల్లా కమిటీ సభ్యులు ఆర్.చంద్రశేఖర్ రెడ్డి, తరిమెల నాగరాజు, టి రామాంజనేయులు, ఇల్లూరు నల్లప్ప, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం

కరపత్రాన్ని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే, తదితరులు

ప్రజాశక్తి-కదిరి టౌన్

రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ తెలిపారు. కదిరి రూరల్ మండలంలోని మోటుకుపల్లి పంచాయతీలో ఆదివారం నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ప్రజల ఆకాంక్షల మేరకు ముందుకెళ్తోందని, ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తుందని స్పష్టం చేశారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు అందుతున్నాయ లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల అధికారులు, కూటమి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నల్లచెరువు : సిఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం సంక్షోభంలోనూ రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తుందని ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ తెలిపారు. నల్లచెరువులో ఆదివారం చేపట్టిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంలో రౌడీయిజం, దౌర్జన్యాలు, అవినీతి తప్ప అభివృద్ధి శూన్యం అన్నారు. గతంలో బిసి హాస్టల్ కోసం భవనాలు నిర్మించినా ప్రారంభానికి నోచుకోలేదని, హాస్టల్ భవనాలను తిరిగి ప్రభుత్వం ఆధీనంలోకి తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బిసి హాస్టల్ కోసం విరాళంగా ఇచ్చిన స్థలాన్ని తిరిగివారే ఆక్రమించుకోవడం సరికాదన్నారు. ఈ విషయంలో సంబంధిత అధికారులు విచారణ చేపట్టి ప్రభుత్వ ఆస్తిని కాపాడాలని కోరారు. కార్యక్రమంలో తహశీల్దార్ రవికుమార్, ఎంపిడిఒ శకుంతల, టిడిపి మండల కన్వీనర్ రాజశేఖర్, నాయకులు మాబు సాహెబ్, అబ్దుల్ ఖాదర్, నాగభూషణనాయుడు, అశ్వత్థనాయుడు, శ్రీరాములు, లక్ష్మీనారాయణ, పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌గా సంఘం శ్రీనివాసులు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం మున్సిపల్ కమిషనర్‌గా సంఘం శ్రీనివాసులను నియమిస్తూ ఆదివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. హిందూపురంలో పనిచేస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డిని డిఎంఎ కార్యాలయంలో రిపోర్ట్ చేసుకోవాలని ఉత్తర్వులలో ప్రభుత్వం పేర్కొంది. సంఘం శ్రీనివాసులు అనంతపురం కార్పొరేషన్ లో సెక్రెటరీగా విధులు నిర్వహిస్తున్నారు. దానికన్నా ముందు మడకశిర నగర పంచాయతీ కమిషనర్‌గా ఇతను విధులు నిర్వహించారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు హిందూపురం కమిషనర్ గా సంఘం శ్రీనివాసులు త్వరలో బాధ్యతలను స్వీకరించనున్నారు.

రైతుల త్యాగాలు మరువలేనివి : మంత్రి

చెక్కులు అందుకున్న రైతులతో మంత్రి సవిత

ప్రజాశక్తి-పెనుకొండ

పరిశ్రమల ఏర్పాటుకు భూములు ఇచ్చిన రైతుల త్యాగాలు మరువలేనివి అని రాష్ట్ర బిసి సంక్షేమం, చేనేత జౌళి శాఖల మంత్రి సవిత తెలిపారు. మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్క్ ఏర్పాటుకు భూములు ఇచ్చిన గొందిపల్లి, కురువవాండ్లపల్లి రైతులకు ఆదివారం పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఉన్న భువన విజయం సమావేశ మందిరంలో మంత్రి సవిత, ఆర్‌డిఒ వెంకటశివ రామిరెడ్డి నష్టపరిహారం చెక్కులు అందజేశారు. మంత్రి మాట్లాడుతూ కియా పరిశ్రమ పెనుకొండకు రావడంలో సిఎం చంద్రబాబు కృషి ఎనలేనిది అన్నారు. కియా నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతులకు అభినందనలు తెలిపారు. లాజిస్టిక్ పార్క్ నిర్మాణానికి భూమి ఇచ్చి పారిశ్రామిక అభివృద్ధికి తోడ్పడ్డారని కొనియాడారు. పరిశ్రమలు వస్తే ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. భూములు కోల్పోయిన రైతుల కుటుంబాల్లో అర్హులైన వారికి ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. జగన్‌రెడ్డి పాలనలో ఇక్కడికి రావాల్సిన కియా అనుబంధ పరిశ్రమలు పక్క రాష్ట్రాలకు తరలిపోయా యని ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబు పాలనలో రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తుందన్నారు. జగన్ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో నాశనం చేయగా వాటిని గాడిలో పెట్టేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలోనే లాజిస్టిక్ పార్కుకు రైతుల నుంచి భూమి తీసుకున్నారే కానీ నష్టపరిహారం ఇవ్వకుండా నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. కూటమి అధికారం చేపట్టిన తక్షణమే రైతుల సమస్యలను సిఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లగా స్పందించి నిధులు విడుదల చేశారన్నారు. లాజిస్టిక్ పార్క్ నిర్మాణానికి 76 మంది రైతుల నుంచి 204 ఎకరాల భూమిని ప్రభుత్వం సేకరించిందని, అందులో మొదటి విడతగా 44 మంది రైతులకు రూ. 19.31 కోట్ల నష్టపరిహారం అందించామన్నారు. రెండో విడతలో 21 మంది రైతులకు రూ. 19.31 కోట్లు అందిస్తున్నామన్నారు. కుటుంబ కలహాలు, వివిధ న్యాయ సంబంధ సమస్యలు ఉన్న 11 మంది రైతులకు పరిహారం రావాల్సి ఉందన్నారు. సమస్యలను పరిష్కరించుకుని పరిహారం చెక్కులు తీసుకోవాలని మంత్రి వారికి సూచిం చారు. అనంతరం రైతులకు నష్టపరిహారం చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో ఎపిఐఐసి జెడ్‌ఎం రోజీ, తహశీల్దార్ శ్రీధర్, టిడిపి జిల్లా అధ్యక్షులు కొల్లకుంట అంజనప్ప, మాజీ జడ్పిటిసి శ్రీనివాసులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన దులీప్ ట్రోఫీ పోటీలు

విజేతగా ఇండియా- ఎ జట్టు

ప్రజాశక్తి - అనంతపురం

అనంతపురం ఆర్డీటీ క్రీడాగ్రామంలో ఈనెల 5న ప్రారంభమైన దులీప్ ట్రోఫీ పోటీలు ఆదివారం ముగిసాయి. ఈటోర్నీలో 12 పాయింట్లతో ఇండియా- ఏ జట్టు అగ్రస్థానంలో నిలిచి టోర్నీ విజేతగా నిలిచింది. 9 పాయింట్లతో ఇండియా- సీ జట్టు రన్నర్స్‌గా నిలిచింది. అనంతపురం ఆర్డీటీ స్పోర్ట్స్ విలేజ్‌లో చివరి రౌండ్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఇండియా ఏ జట్టు 132 పరుగులతో ఇండియా సీ జట్టుపై, ఇండియా డీ జట్టు 257 పరుగుల భారీ తేడాతో ఇండియా- బీ జట్టుపై విజయం సాధించాయి. ఇండియా బీతో జరిగిన మ్యాచ్‌లో ఇండియా - డీ బ్యాట్స్‌మెన్ రిక్కీభుయ్ (56, 119) ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచాడు. ఇండియా ఏతో జరిగిన మ్యాచ్‌లో సీ జట్టు క్రీడాకారుడు సాయిసుదర్శన్ సెంచరీ సాధించాడు. ఇండియా - సితో జరిగిన మ్యాచ్‌లో ఏ జట్టు క్రీడాకారుడు శాశ్వత్ రావత్ (124, 53) ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచాడు. ఇండియా సీ జట్టు క్రీడాకారులు అన్షుల్ కాంబోజ్ ప్లేయర్ ఆఫ్ ద సీరీస్‌గా(16 వికెట్లు, 41 పరుగులు) నిలిచాడు. టోర్నీ విజేత ఇండియా-ఏ జట్టుకు ఏసీఏ కార్యదర్శి సానా సతీష్ బాబు విన్నర్స్ కప్‌ను అందజేశారు. రన్నర్స్‌కు రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ కప్‌ను అందజేశారు. స్టైకర్ ఆఫ్ ది సిరీస్ కింద రికీభుయ్‌కి మంత్రి పయ్యావుల కేశవ్, ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌కు సంబంధించి ఏ గ్రౌండ్‌లో శాశ్వర్‌రావత్‌కు ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్, బి గ్రౌండ్‌లో రిక్కీభుయ్‌కి ఏసీఏ అతిథి ఆర్‌విఎస్‌కె. రంగారావ్ చెక్కులను అందజేశారు.

రిక్కీభుయ్ అజేయ శతకం..ఇండియా డీ భారీ విజయం

ఇండియా బీతో జరిగిన మ్యాచ్‌లో ఇండియా డీ జట్టు భారీ విజయం సాధించింది. ఓవర్‌నైట్ స్కోర్ 244/5తో ప్రారంభించిన ఇండియా డీ జట్టు 305 పరుగులకు ఆలౌట్ అయ్యింది. తెలుగుతేజం రిక్కీభుయ్ అజేయ శతకం సాధించాడు. టోర్నీలో రిక్కీ భుయ్ రెండో సెంచరీ ఇది. చివరి మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్‌లోనూ రిక్కీభుయ్ అర్ధ సెంచరీ సాధించిన విషయం తెలిసిందే. 124 బంతులు ఎదుర్కొన్న రిక్కీ భుయ్ 15 ఫోర్లు, 3 సిక్సర్ల సహాయంతో 119 పరుగులతో అజేయంగా నిలిచాడు. దీంతో ఇండియా డీ జట్టు మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యాన్ని కలుపుకుని ఇండియా బీ జట్టు ముందు 373 పరుగల లక్ష్యాన్ని ఉంచింది.

అర్ష్‌దీప్, థాకరే ధాటికి బీ జట్టు 115కి ఆలౌట్

373 పరుగుల భారీ లక్ష్యంతో బరిలో దిగిన ఇండియా బీ జట్టు ఇండియా డీ జట్టు బౌలర్లు అర్ష్‌దీప్ సింగ్, ఆదిత్య థాకరే ధాటికి విలవిల లాడింది. వీరిద్దరూ నిప్పులు చెరిగే బౌలింగ్‌తో బీ జట్టుపై విరుచుకుపడ్డారు. అర్ష్‌దీప్ సింగ్ 11.2 ఓవర్లలో 40 పరుగులిచ్చి 6 వికెట్లు, ఆదిత్య థాకరే 11 ఓవర్లలో 59 పరుగులిచ్చి 4 వికెట్లు పడగొట్టారు. దీంతో ఇండియా బీ జట్టు 22.2 ఓవర్లలో కేవలం 115 పరుగులకు ఆలౌట్ అయ్యింది. ఇండియా డీ జట్టు 257 పరుగుల భారీ తేడాతో బీ జట్టుపై గెలుపొందింది.

సాయిసుదర్శన్ సెంచరీ వృథా.. ఇండియా సీ 217 పరుగులకు ఆలౌట్

ఇండియా ఏతో జరిగిన మ్యాచ్‌లో సీ జట్టు క్రీడాకారుడు సాయి సుదర్శన్ చేసిన సెంచరీ వథా అయ్యింది. ఓవర్‌నైట్ స్కోర్ 270/6తో ప్రారంభించిన ఇండియా ఏ జట్టు మరో 16 పరుగులు జోడించి డిక్లేర్ చేసింది. దీంతో ఇండియా సీ జట్టు ముందు 350 పరుగుల లక్ష్యం నిలిచింది. భారీ చేధనలో ఏ బౌలర్ల ధాటికి సీ జట్టు క్రీడాకారులు నిలువలేకపోయారు. 81.5 ఓవర్లలో 217 పరుగులకు ఆ జట్టు ఆలౌట్ అయింది. ఆ జట్టులో సాయిసుదర్శన్ ఒంటిరి పోరాటం చేశాడు. 206 బంతుల్లో 12 బౌండరీల సహాయంతో 111 పరుగులు చేశాడు. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ 44(5 ఫోర్లు), వైశాక్ 17, ఇషాన్ కిషన్17 మినహా మిగితా వారు రెండంకెల స్కోర్ కూడా దాటలేకపోయారు. ఇండియా ఏ జట్టు బౌలర్లలో ప్రసిద్ధ్‌కృష్ణ 3, తనుష్ కొటియన్ 3, అకిబ్‌ఖాన్2, సామ్స్ ములానీ వికెట్ తీసుకున్నారు. దీంతో ఇండియా ఏ జట్టు 132 పరుగుల తేడాతో విజయం సాధించింది. ముగింపు కార్యక్రమంలో ఏసీఏ కౌన్సిలర్ డి.గౌర్ విష్ణు, గేమ్ డెవలప్‌మెంట్ జనరల్ మేనేజర్ ఎం.ఎస్.కుమార్, జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్, జాయింట్ కలెక్టర్ శివనారాయణ్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

వికలాంగుల అభ్యున్నతికి చేయూత

వికలాంగ, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఎడి ఎస్.అబ్దుల్ రసూల్

ఏడీ అబ్దుల్ రసూల్

- పుట్టపర్తి రూరల్

సమాజంలో అన్ని రంగాల్లో వెనుకబడిన వారికి ప్రభుత్వం నుంచి అన్ని విధాలా చేయూతను అందిస్తున్నట్లు ఉమ్మడి అనంతపురం జిల్లా వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఏడి ఎస్. అబ్దుల్ రసూల్ పేర్కొన్నారు.ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇలాంటి వారిని గుర్తించి వారికి ప్రభుత్వ ప్రోత్సాహాన్ని అందించేలా తమ శాఖ కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వ పథకాలపై అవగాన కల్పించి అర్హులకు లబ్ది చేకూరుస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ప్రజాశక్తితో నిర్వహించిన ముఖాముఖిలో ఆశాఖ ద్వారా జరుగుతున్న పలు విషయాలను వివరించారు.

ప్రశ్న :ఉమ్మడి జిల్లాలో ప్రోత్సాహాల గురించి వివరించండి.?

ఏ డీ : ప్రస్తుతం అనంతపురం, సత్యసాయి జిల్లాలో ఉన్న వికలాంగుల అభివృద్ధి కోసం అనంతపురంలో జిల్లా కార్యాలయం ఏర్పాటు చేశాం. అక్కడి నుండే కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. శ్రీ సత్యసాయి జిల్లాలో కార్యాలయాన్ని త్వరలో ఏర్పాటు చేయనున్నాం. ఇటీవల ఉమ్మడి జిల్లాలో వికలాంగుల కోసం మూడు చక్రాల వాహనాలను పంపిణీ చేశాం డిగ్రీ, పీజీ విద్యార్థులకు ట్యాబులు, ట్రైసైకిళ్లను పంపిణీ చేశాం.

ప్ర : వికలాంగ విద్యార్థులకు అందిస్తున్న ప్రోత్సాహకాలు ఏమిటి.?

జ : డిగ్రీ, డిప్లొమా అంతకంటే ఎక్కువ తరగతులు చదువుతున్న విద్యార్థులకు, 40 శాతం అంతకంటే ఎక్కువ అంగవైకల్యం కలిగి ఉండి తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.2.50 లక్షలు మించని వారికి ప్రోత్సహాలను అందజేస్తున్నాం. వీటిని పొందేందుకు అర్హులైన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలి.

ప్ర : వికలాంగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారా.?

జ : ఏపీ ప్రభుత్వం 2002 నుంచి వికలాంగుల కోసం ప్రత్యేక రిక్రూట్‌మెంట్ ఏర్పాటు చేసింది. 2020 సంవత్సరంలో నాలుగు శాతం రిజర్వేషన్లు పెంచింది. దృష్టిలోపం, వినికిడి లోపం, వైకల్యం, మేధావైకల్యం, నిర్దిష్ట అభ్యాసన వైకల్యం, మానసిక ఆనారోగ్యం, బహుళ వైకల్యం ఉన్నవారికి ఈ సంవత్సరం నుంచి బ్యాక్ లాగ్ పోస్టులు ఇవ్వనున్నాం. ఇదివరకు 37 పోస్టులను మంజూరు చేశాం. ఉన్నతాధికారుల నిర్ణయం మేరకు నోటిఫికేషన్ జారీ చేస్తాం.

ప్ర : అంధుల కోసం చేస్తున్న కార్యక్రమాలు ఏమిటి.?

జ : ఉమ్మడి అనంతపురం జిల్లాలో అంధుల కోసం రెండు హాస్టళ్లు ఉన్నాయి. వాటిలో 150 మంది ఆంధులకు పునరావాసం కల్పించాం. వారిలో వందమంది బాలురు, 50 మంది బాలికలు ఉన్నారు. అంధుల కోసం హాస్టళ్లలో ఉచితంగా వసతి, ఆహారం కాస్మోటిక్ ఛార్జీలు ఇస్తున్నాం. వయోవృద్ధులకూ కొన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం.

ప్ర : వికలాంగులకు ఎలాంటి ప్రోత్సాహకాలు ఇస్తున్నారు..?

జ : వికలాంగులు, వయోవృద్ధులు, విద్యార్థులకు ప్రభుత్వం ఎన్నో పథకాల ద్వారా చేయూతను ఇస్తోంది. విద్యార్థులు తల్లిదండ్రుల ఆదాయాన్ని బట్టి జాతీయ ఉపకార వేతనాలు, ట్రై సైకిల్ చక్రాల కుర్చీలు, త్రీ వీలర్లు, వినికిడి పరికరాలు, వాకింగ్ స్టిక్, ప్లేటు వంటి వివిధ సహాయ ఉపకరణాలను అందిస్తోంది. డిప్లొమా, డిగ్రీ, పీజీ చదువుతున్న విద్యార్థులకు ప్రొఫెషనల్ కోర్సులు చేస్తున్న వారికి ట్యాబులు ప్రభుత్వం ద్వారా అందిస్తున్నాం.

ఘోర రోడ్డు ప్రమాదం

నలుగురు యువకులు మృతి

ప్రమాదంలో దెబ్బతిన్న లారీ

ప్రజాశక్తి - బుక్కరాయసముద్రం

బుక్కరాయసముద్రం మండలం రేకులకుంట సమీపాన శనివారం అర్ధరాత్రి జరిగిన ఘోరరోడ్డు ప్రమాదంలో నలుగురు యువకులు మృతిచెందాడు. ఈ ఘటనకు సంబందించి బుక్కరాయసముద్రం సిఐ కరుణాకర్ తెలిపిన వివరాలు... అనంతపురం జిల్లా కేంద్రంలోని స్టాలిన్ నగర్‌కు చెందిన దాసరి శ్రీనివాసులు (23), షేక్ మస్తాన్(19), ఎర్రగుడి పవన్ కుమార్, ఓబులశెట్టి పవన్ (23) పనినిమిత్తం ఇన్నోవా కారులో నార్పలకు శనివారం రాత్రి 12 గంటల సమయంలో బయలుదేరారు. అదే సమయంలో నార్పల నుండి అనంతపురం జిల్లా కేంద్రానికి వేరుశనగ విత్తనాలతో లోడుతో వస్తున్న లారీ రేగులకుంట సమీపాన ఇన్నోవాను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇన్నోవాలో ఉన్న నలుగురు యువకులు అక్కడికి అక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలాన్ని సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. మృతుల కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మృతులు దాసరి శ్రీనివాసులు, షేక్ మస్తాన్ (ఫైల్‌ఫొటోలు)


మృతులు ఎర్రగుడి పవన్‌కుమార్, ఓబుళశెట్టి పవన్ (ఫైల్‌ఫొటోలు)

కొత్తచెరువు-గోరంట్లపల్లిరహదారి నిర్మాణంపై పల్లెకు విన్నవిస్తున్న రైతులు

కొత్తచెరువు-గోరంట్లపల్లి రహదారి వేయిస్తా : పల్లె

ప్రజాశక్తి-కొత్తచెరువు రూరల్

కొత్తచెరువు నుంచి గోరంట్లపల్లి వరకూ రహదారి నిర్మాణాన్ని పూర్తి చేయించే బాధ్యత నాది అని మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి రైతులకు హామీ ఇచ్చారు. ఈ రహదారి నిర్మాణానికి 2019లోనే నిధులు మంజూరు కాగా పనులు ప్రారంభించిన సమయంలో ఎన్నికలు రావడం, వైసిపి అధికారం చేపట్టడంతో ఆ పనులు ఆగిపోయాయి. ఆ నిధులను వైసిపి ప్రభుత్వం పక్కదారి పట్టించింది. ప్రస్తుతం టిడిపి అధికారం చేపట్టడంతో సింగిల్‌విండో మాజీ అధ్యక్షులు సురేంద్ర బాబు నాయకత్వంలో పలువురు రైతులు పల్లె రఘునాథ్‌రెడ్డిని కలిసి సమస్యను వివరించారు. స్పందించిన పల్లె ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెవెళ్లి రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కోరారు. రహదారి నిర్మాణం పూర్తి చేయిస్తానని రైతులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రైతులు హరి, జానకంపల్లి తిరుపాలు, రాగుల వెంకట్రాముడు, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సెమినార్‌లో మాట్లాడుతున్న ప్రేమ్‌చంద్

'దేశ పురోభివృద్ధి-విద్యార్థుల పాత్ర'పై సెమినార్

ప్రజాశక్తి-పరిగి

మండలంలోని కొడిగెనహళ్లి ఎపి ఆర్‌ఎస్ పాఠశాలలో ఆదివారం చెర్లోపల్లి మారుతిరెడ్డి ఆధ్వర్యంలో 'దేశం పురోభివృద్ధి-విద్యార్థుల పాత్ర' అంశంపై సెమినార్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ప్రముఖ మోటివేటర్, యూట్యూబ్ సెమినార్ వ్యాఖ్యాత ప్రేమ్‌చంద్ హాజరై మాట్లాడారు. విద్యార్థి దశలోనే లక్ష్యం పెట్టుకుని ఆ లక్ష్యసాధన కోసం యువత ప్రయత్నించాలన్నారు. తన యూట్యూబ్ ఛానల్ ద్వారా చాలామంది యువత స్ఫూర్తి పొంది దేశ స్థితిగతులు, దేశానికి తాము ఏం చేయాలన్నా అంశాలపై సమాలోచన చేయడం ఎంతో సంతోషం ఇచ్చిందన్నారు. కార్యక్రమంలో భాస్కర్‌రెడ్డి, ప్రిన్సిపల్ మురళీధర్‌బాబు, భగత్‌సింగ్ సేవా సమితి సభ్యులు కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరి ప్రత్యేక సంచికను పంపిణీ చేస్తున్న నాయకులు

సీతారాం ఏచూరి ఆశయాలను కొనసాగిద్దాం

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

సిపిఎం జతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి తుది శ్వాస వీడే వరకూ పార్టీ సిద్ధాంతాలు పాటించారని సిఐటియు పట్టణ కార్యదర్శి పైపల్లి గంగాధర్ పేర్కొన్నారు. ప్రజాశక్తి దినపత్రిక ప్రచురించిన ప్రత్యేక సంచికను ఆదివారం ఆయన ఆవిష్కరించి పట్టణంలో ప్రజలకు పంచిపెట్టారు. ఆయన మాట్లాడుతూ కమ్యూనిస్టు సిద్ధాంతాలను నమ్మి అంచెలంచెలుగా జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఏదిగారన్నారు. ఆయన లేని లోటు పార్టీకి తీరని లోటు అన్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకొని ఆయన ఆశయాలను కొనసాగిద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు నాగార్జున, నరసింహులు, భవన నిర్మాణ కార్మిక నాయకులు రమేష్, సుధాకర్, నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు జయచంద్ర, మురళి, గోపి, తదితరులు పాల్గొన్నారు..

సాధించిన కరాటే బెల్టులతో విద్యార్థులు

కరాటే బెల్ట్ టెస్ట్‌లో విద్యార్థుల సత్తా

కదిరి టౌన్ : కరాటే వల్ల ఆత్మరక్షణ, ఆత్మవిశ్వాసం, శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం, మేధాశక్తి పెంపొందుతాయని కరాటే మాస్టర్ షాకీర్ తెలిపారు. పట్టణంలోని బాలికల జడ్పీ హైస్కూల్ ఆవరణలో ఆదివారం మాస్టర్ షాకీర్ ఆధ్వర్యంలో బెల్ట్ టెస్ట్‌లు నిర్వహించారు. అనంతరం మాస్టర్ షాకీర్ కరాటే వల్ల కలిగే లాభాలు, ఉపయోగాలను విద్యార్థులకు వివరించారు. చదువుతో పాటు కరాటేలో శిక్షణ పొందాలన్నారు. కలర్ బెల్ట్స్, సీనియర్ బ్రౌన్ బెల్ట్స్ పరీక్షల్లో 19 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఆరుష్, జశ్వి, తన్మయశ్రీ, వైష్ణవి ఎల్లో బెల్ట్స్, తవిష్ ఆరంజ్ బెల్ట్, చేతన్, ధీరజ్‌రెడ్డి, భవిత్, జ్యోషిత బ్లూ బెల్ట్, హారిక పుర్పుల్ బెల్ట్ సాధించారు. ఇక తపన్, జశ్విత, మొహమ్మద్ ఫహీమ్, రిషిత, రబ్బన్, రేహన్, కృష్ణకీర్తి, మొహమ్మద్ కైఫ్, వైష్ణవి సీనియర్ బ్రౌన్ బెల్ట్స్ సాధించగా షాకీర్ బెల్ట్, ప్రశంసా పత్రం అందజేశారు. కార్యక్రమంలో కోచ్‌లు చాందిని, రంజిత్, మొహమ్మద్ కైఫ్ పాల్గొన్నారు

హోరాహోరీగా ఫుట్‌బాల్ పోటీలు

మడకశిర : మడకశిర ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని జూనియర్ కళాశాల క్రీడా మైదానం ఫుట్‌బాల్ పోటీలు నిర్వహించారు. అందులో మడకశిర, హిందూపురం, పరిగి, ఆర్‌డిటి జట్లు తలపడ్డాయి. రసవత్తరంగా సాగిన రెండు మ్యాచ్‌ల్లో ఇరుజట్లు రెండు గోల్స్ సాధించాయి. పోటీలను అసోసియేషన్ సభ్యులు నవీద్, కోచ్‌లు బాలాజీ, జగదీశ్ పర్యవేక్షించారు.

సైకిల్‌తోనే ఆరోగ్యం

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

ఆధునిక యుగంలో కనుమరుగవుతున్న సైకిల్ మనిషి ఆరోగ్యంలో ఎంత ముఖ్యమైన పాత్ర పోషిస్తుందో తెలియజేయడానికి ధర్మవరం సైక్లింగ్ అండ్ వాకర్స్ క్లబ్, ఎపి కాలుష్య నివారణ బోర్డు సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం పట్టణంలో సైక్లింగ్ కార్యక్రమం చేపట్టారు. ర్యాలీలో విద్యార్థులు, యువత, ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొని విజయవంతం చేశారు. డిసివిసి సభ్యులు మాట్లాడుతూ సమాజంలో ఎక్కువ శాతం ప్రజలు సైకిల్ వినియోగించడం మాని కాలుష్య కారకాలైన మోటారు బైకులు, కారు, తదితర వాహనాలకి అలవాటు పడి అనారోగ్యాల బారిన పడుతున్నారన్నారు. గతంలో చాలా మంది సైకిల్ మాత్రమే వినియోగించేవారని, అప్పుడు ఇప్పటి లాగా వాతావరణ కాలుష్యం కానీ మనుషులకు అనారోగ్య సమస్యలు కానీ ఉండేది కాదన్నారు. కావున అందరూ సైకిల్‌ని ఎక్కువగా వినియోగించడం అలవాటు చేసుకోవాలన్నారు. ర్యాలీలో బిఎస్ఆర్ పాఠశాల హెచ్‌ఎం రాంప్రసాద్, ఎపి కాలుష్య నివారణ బోర్డు అధికారులు, ట్రాఫిక్ ఎస్ఐ వెంకటరాముడు, డిసివిసి గౌరవాధ్యక్షులు గోరకాటి పెద్దారెడ్డి, అధ్యక్షులు బాబా ఫకృద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

సైకిల్ ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, ప్రజలు

సమస్యలు పరిష్కరిస్తాం : మంత్రి సవిత

ప్రజాశక్తి-గోరంట్ల

ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు గ్రామాల్లో అన్ని సమస్యలు పరిష్కరిస్తామని బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత తెలిపారు. పట్టణంలోని శివాలయం వద్ద టిడిపి నాయకుడు వెంకటరమణ సొంత నిధులు రూ. 2.5 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును మంత్రి ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ వెంకటరమణ సొంత నిధులతో రోడ్డు వేయించడం అభినందనీయమన్నారు. మండలంలో రోడ్లు, డ్రెయినేజీల ఏర్పాటుకు రూ. 6 కోట్లు మంజూరయ్యాయన్నారు. రోడ్డు సమస్య ఉన్న ప్రతి చోట సీసీ రోడ్లు వేస్తామని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ సోమశేఖర్, నాయకులు బాలకృష్ణ చౌదరి, నరేష్, వేణు రాయల్, నిమ్మల శ్రీధర్, కిషోర్, వెంకటరమణ యాదవ్, హరి, అశోక్, తదితరులు పాల్గొన్నారు

ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించిన మంత్రి

పట్టణంలోని వాసవీ ఫంక్షన్ హాలులో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బలరాం గుప్తా ఆయన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఉచిత వైద్య శిబిరం

గోరంట్లలో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న మంత్రి సవిత

ఏర్పాటు చేయగా మంత్రి సవిత ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ పేదల కోసం ఉచిత వైద్యం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలకు నా వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. శిబిరంలో బెంగళూరుకి చెందిన ఆర్‌వి హాస్పిటల్ వైద్యులు 560 మందికి వైద్య పరీక్షలు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. శిబిరంలో వైద్యులు శ్రీనివాస్, శ్యాంసుందర్, లోకనాథ్, ఆర్యవైశ్య సంఘం కమిటీ సభ్యులు, పాల్గొన్నారు.

దశల వారీగా ఎన్నికల హామీలు అమలు చేస్తాం

ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి

ప్రజాశక్తి-కొత్తచెరువు రూరల్

ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను సిఎం చంద్రబాబు దశల వారీగా అమలు చేస్తారని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి తెలిపారు. మండలంలోని మరుకుంటపల్లి గ్రామంలో ఆధునీకరించిన కుంటెమ్మ దేవి ఆలయాన్ని ఆదివారం వారు సందర్శిం చారు. ముందుగా వారికి టిడిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఘనస్వాగతం పలికారు. ఆలయంలో పూజల అనంతరం వారిని ఘనంగా సన్మానించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తయినందున గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలన్నారు. ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను ప్రతి ఒక్కరూ గుర్తు పెట్టుకోవాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి ఎస్.శ్రీనివాసులు, టౌన్ కన్వీనర్ వలిపి శ్రీనివాసులు, మాజీ జడ్పిటిసి లక్ష్మీనారా యణ, మాజీ సర్పంచి రమేష్‌రెడ్డి, టిడిపి నాయకులు కాంట్రాక్టర్ లక్ష్మీనారాయణ, వెంకటనారాయణరెడ్డి, పెద్దన్న, ఎస్.వంశీకిషోర్, నల్లమాడ శంకర్, వెంకటనాయుడు, రామచంద్ర, యశోద, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డిలను సన్మానించిన గ్రామస్తులు

గ్రామపంచాయతీల అభివృద్ధికి బాటలు

'ఇది మంచి ప్రభుత్వం'లో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

ప్రజాశక్తి-అగళి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నిధులు విడుదల చేసి గ్రామపంచాయతీల అభివృద్ధికి బాటలు వేసిందని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు తెలిపారు. మండలంలోని కోడిపల్లి పంచాయతీ లో ఆదివారం చేపట్టిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో సంపదను సృష్టించి అభివృద్ధి బాటలో నడిపిస్తున్న గొప్ప వ్యక్తి సిఎం చంద్రబాబు అన్నారు. పింఛన్ల మొత్తం పెంపు, డీఎస్సీ ప్రకటన, అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ, ఎన్టీఆర్ సుజల స్రవంతి తాగునీటి పథకం ఏర్పాటు, తదితర ఎన్నో ప్రజా ఉపయోగ కార్యక్రమాలు చేపట్టిందన్నారు. రాళ్లపల్లి, రత్నగిరి రిజర్వాయర్లతో పాటు వక్క మార్కెట్, మడకశిరను పారిశ్రామిక హబ్‌గా మార్చేందుకు నాంది పలికిందన్నారు. అల్లికెర పంచాయతీ మహిళల తాగునీటి సమస్యను లేవనెత్తగా నాలుగు రోజుల్లోపు గ్రామంలో కొత్త బోరు వేయిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం మహిళా సంఘం ద్వారా ఎస్సీ, ఎస్టీలకు వడ్డీలేని రూ. 50 లక్షల చెక్కును అందజేశారు.

రూ. 50 లక్షలతో ఆసుపత్రి గదులకు భూమిపూజ

ఆసుపత్రి గదులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే రాజు

అగళిలో ప్రభుత్వ ఆసుపత్రికి రూ. 50 లక్షలతో మంజూరైన అదనపు గదులకు ఎమ్మెల్యే రాజు భూమిపూజ చేసి మాట్లాడారు. ఆసుపత్రికి అవసరమైన పరికరాలు తెప్పించి రోగులకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులు, సిబ్బందికి సూచించారు. రాబోయే రోజుల్లో 30 పడకలు మంజూరుకు ప్రయత్నం చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో జడ్పిటిసి ఉమేష్, మండల కన్వీనర్ కుమార్‌స్వామి, కార్యదర్శి జయన్న, నాయకులు శివకుమార్, బిజెపి నాయకులు, ప్రభుత్వ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

'పరిటాల' అభిమానుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలు

ప్రజాశక్తి-బత్తలపల్లి

ధర్మవరం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి, రాష్ట్ర అధికార ప్రతినిధి పరిటాల శ్రీరామ్ జన్మదినం సందర్భంగా ఆదివారం టిడిపి ఆధ్వర్యంలో స్థానిక ఆర్‌కె కళ్యాణ మండపంలో 35 కిల్లో కేక్ కట్ చేశారు. అక్కడే పరిటాల యవసేన ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేయగా 200 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఆర్‌డిటి బ్లడ్ బ్యాంక్ ఇన్‌ఛార్జి కిషోర్ సహకారంతో ఆర్‌డిటి సిబ్బంది రక్తదాన శిబిరంలో సేవలు అందించారు. అనంతరం విందు భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నియోజవర్గం తెలుగు రైతు అధ్యక్షులు చల్లా శ్రీనివాసనాయుడు, మండల కన్వీనర్ గోనుగుంట్ల నారాయణరెడ్డి, నాయకులు గోనుగుంట్ల అమర్‌నాథ్‌చౌదరి, సురేంద్రనాయుడు, నెట్టెం రమణ, జక్కంపూడి నాగభూషణ, జగ్గు, సూరి, సతీష్, రవి, రంగనాయుడు, అయ్యప్ప, మనోజ్, బాలాంజనే యులుయాదవ్, కేశవ, విశ్వనాథనాయుడు, చల్లా బొజ్జి, సర్పంచి ప్రభాకర్‌రెడ్డి, అక్కులప్ప, చల్లా కృష్ణమనాయుడు, కృష్ణారెడ్డి, కృష్ణయ్య, సదాశివ, హరి, తరిగోపుల చౌదరి, చంద్రశేఖర్, చిన్నా, బాబు, అప్పస్వామి, నారాయణస్వామి, చిదంబరెడ్డి, కరణం హేమంత్ కుమార్, ఉమాపతి పాల్గొన్నారు. అలాగే మండలంలోని పలు గ్రామాల్లో టిడిపి నాయకులు స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈదుల ముష్టూరులో లాయర్ సూర్యప్రకాష్‌రావు, కరణం హేమంత్‌కుమార్ ఆధ్వర్యంలో టిఎన్‌టియుసి మండల అధ్యక్షులు మారుతిగౌడ్, కొండన్న, తదితరులు ఇంటింటికీ వెళ్లి మొక్కలు పంపిణీ చేశారు.

ధర్మవరంరూరల్ : టిడిపి నాయకులు సందా రవీంద్ర, సందా రాఘవ ఆధ్వర్యంలో మండలంలోని గొట్లూరు అనాథాశ్రమంలో వృద్ధుల సమక్షంలో పరిటాల శ్రీరామ్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. అనాథాశ్రమం

ముదిగుబ్బలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసిన టిడిపి నాయకులు

వ్యవస్థాపకులు ఎల్.ప్రఫుల్ల చంద్రకు రూ. 10వేలు విరాళం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కొడవండ్లపల్లి హరి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : ధర్మవరం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ జన్మదినం సందర్భంగా ఆదివారం స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జి తుమ్మల మనోహర్ ఆధ్వర్యంలో పరిటాల శ్రీరామ్ ట్రస్ట్ సహకారంతో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. తుమ్మల మనోహర్ మాట్లాడుతూ పరిటాల రవీంద్ర వారసుడిగా, ధర్మవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా, రాష్ట్ర అధికార ప్రతినిధిగా పరిటాల శ్రీరామ్ టిడిపికి విశేష సేవలు అందిస్తున్నారన్నారు. ఆయన భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని టిడిపి నాయకులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు రాధమ్మ, సీనియర్ నాయ కులు రమేష్‌బాబు, ప్రభాకర్‌నాయుడు, కోట్ల బాబి, తుమ్మల సూరి, అశ్వత్థరెడ్డి, నాగిరెడ్డి, హేమాబాయి, రంగనాయకులు, ఎస్.అబ్దుల్లా, తదితరులు పాల్గొన్నారు.

పాత్రికేయుల సమస్యలు పరిష్కరించుకుందాం

పుట్టపర్తి అర్బన్ : పాత్రికేయులు అందరూ ఐక్యంగా ఉంటే సమస్యలు పరిష్కరించుకోవచ్చని ఎపియుడబ్ల్యుజె జిల్లా అధ్యక్షుడు పుల్లయ్య, ప్రధాన కార్యదర్శి బాబు, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు హరి పేర్కొన్నారు. సాయి ఆరామంలో ఆదివారం ఆ యూనియన్ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రెస్ క్లబ్, విలేకరులకు ఇళ్ల పట్టాలు సాధించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. దాతల సహకారంతో పాత్రికేయుల సంక్షేమ నిధి ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఐజెయు సభ్యుడు అయ్యన్నగారి శ్రీనివాసులు, సీనియర్ రిపోర్టర్ ఉద్దండం చంద్రశేఖర్, పాత్రికేయులు పాల్గొన్నారు.

నేడు పారిశుధ్య కార్మికులకు వైద్య శిబిరం

పుట్టపర్తి అర్బన్ : మిషన్ స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో సోమవారం మున్సిపల్ పారిశుధ్య కార్మికులు, వారి కుటుంబ సభ్యుల కోసం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ప్రహ్లాద ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మున్సిపాలిటీ కార్యాలయం వెనుక ఉన్న ఆర్‌వి జానకి రామయ్య కళ్యాణం మండపంలో ఏర్పాటు చేస్తామని, ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ తుంగ ఓబుళపతి హాజరవుతారని తెలిపారు. కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, పురపాలక, కార్యాలయ సిబ్బంది పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ప్రయివేటు పాఠశాలల సంఘం జిల్లా అధ్యక్షులుగా అనిల్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి-నల్లచెరువు

జిల్లా ప్రయివేటు పాఠశాలల సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన అనిల్ కుమార్‌రెడ్డికి నల్లచెరువు ప్రయివేట్ పాఠశాలల ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. వారు మాట్లాడుతూ అనిల్ ఎన్నిక ద్వారా ప్రయివేటు పాఠశాలల యాజమాన్యం ఎదుర్కొంటున్న వివిధ సమస్యల పరిష్కారానికి మార్గం సులువు అయిందన్నారు. అనిల్ మాట్లాడుతూ ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. అనిల్‌కు నల్లచెరువు ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యం ఉపాధ్యాయులు, బ్రిలియంట్ స్కూల్ కరస్పాండెంట్ కార్తీక్, హెచ్‌ఎం శ్రీనివాసులు, ఇతర పాఠశాల ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న రత్నాకర్

సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో నూతన టెక్నాలజీ

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో 'ఆత్మ' అనే అధునాతన హాస్పిటల్ మేనేజ్‌మెంట్ సాఫ్ట్‌వేర్‌ను ప్రవేశపెట్టినట్లు ట్రస్ట్ సభ్యుడు ఆర్‌జె.రత్నాకర్ ప్రవేశపెట్టారు. ఆదివారం ట్రస్ట్ వర్గాలు మాట్లాడుతూ ఆత్మ సాఫ్ట్‌వేర్‌తో హై-ఎండ్ టెక్నాలజీని ఒకచోట చేర్చి, తద్వారా ఆరోగ్య సంరక్షణ ప్రక్రియలను సరళంగా మరింత సమర్థవంతంగా చేస్తుందన్నారు. వైద్యులు, నర్సుల కోసం ప్రత్యేక మొబైల్ యాప్‌లను కలిగి ఉండేలా తయారు చేశారన్నారు.

ఆలయంలో కర్నాటక మంత్రి ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-కొత్తచెరువు రూరల్

మండలంలోని మరుకుంటపల్లి గ్రామంలో దాతల సహాయ సహకారాలతో ఇటీవల నిర్మించిన కుంటెమ్మదేవి ఆలయంలో ఆదివారం కర్నాటక రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రామలింగా రెడ్డి, ఎమ్మెల్యే ఎంఎస్.రాజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా వారిని గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. అనంతరం వారు బోనాలు, అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు వెంకటరాముడు, మంజునాథ్, హనుమంతు, బుక్కపట్నం మాజీ సర్పంచి యశోద, గ్రామస్తులు పాల్గొన్నారు.

కర్నాటక మంత్రి రామలింగారెడ్డికి పూలబొకే ఇస్తున్న గ్రామస్తులు

సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

స్వచ్ఛ భారత్ కార్మికుల నూతన కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

సిఐటియు ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న స్వచ్ఛ భారత్ కార్మికుల నూతన కమిటీని ఏర్పాటు చేశారు. సిఐటియు మండల కన్వీనర్ జెవి.రమణ, కో కన్వీనర్లు అయూబ్‌ఖాన్, ఆదినారాయణ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో స్వచ్ఛ భారత్ కార్మికులతో వెట్టి చాకిరీ చేయిస్తున్నారే కానీ సకాలంలో వేతనాలు ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికుల జీవితాల్లో సేవ తప్ప వారి కుటుంబాల్లో సంతృప్తి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా వారికి ఆరు నెలల బకాయి వేతనాలు చెల్లించాలని, కనీస వేతనం అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయా సమస్యలపై సోమవారం గ్రీవెన్స్ డే సందర్భంగా ఆర్‌డిఒ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపడతామని తెలిపారు. కమిటీ నూతన అధ్యక్షురాలుగా ఐ.లక్ష్మీదేవి, కార్యదర్శిగా కె.నాగవేణి, కోశాధికారిగా శ్రీలక్ష్మి, మరో 9 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ పాఠశాలల సంఘం నాయకురాళ్లు జయమ్మ, ఆర్.భాగ్యమ్మ, ముంతాజ్, తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా జలాలు విడుదల చేయాలని మంత్రికి వినతి

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

మంత్రి నిమ్మల రామానాయుడుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సింధూర, మాజీ మంత్రి పల్లె

బుక్కపట్నం చెరువు, మారాల రిజర్వాయర్‌కు జీడిపల్లి రిజర్వాయర్ నుంచి కృష్ణా జలాలు విడుదల చేయాలని కోరుతూ ఆదివారం ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును కోరారు. మంత్రి నిమ్మల ఆదివారం అనంతపురంలోని ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో ఉండగా ఎమ్మెల్యే సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. నియోజకవర్గంలోని 195 చెరువులకు నీటిని అందించే ఎత్తిపోతల పథకానికి నిధులు కేటాయించాలని విన్నవించగా మంత్రి నిమ్మల తప్పకుండా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు.

రౌడీ షీటర్లకు పోలీసుల కౌన్సెలింగ్

ప్రజాశక్తి-పుట్టపర్తిరూరల్

జిల్లా ఎస్పీ వి.రత్న ఆదేశాల మేరకు ఆదివారం జిల్లావ్యాప్తంగా రౌడీషీటర్లు, పాత కేసుల్లో నిందితులకు పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. అలాగే పలువురికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారి ప్రవర్తనపై నిరంతరం పోలీసుల నిఘా ఉంటుందని, ఎలాంటి గొడవలకు వెళ్లినా, సమస్యలు సృష్టించినా, ప్రేరేపించినా, కారణమైన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సత్ప్రవర్తనతో నడుచుకొని ప్రశాంత జీవితం గడపాలని సూచించారు. అక్రమంగా టపాసులు అమ్మి గతంలో కేసులు నమోదైన వారి ఇళ్లలో పోలీసులు సోదాలు చేశారు. అనుమతులు లేకుండా టపాసులు నిల్వ ఉంచుకోవద్దని హెచ్చరించారు. అలాగే సాయంత్రం జిల్లా వ్యాప్తంగా అన్ని జాతీయ రహదారులు, ప్రధాన రహదారుల వద్ద వాహనాలను తనిఖీ చేశారు. అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేలా ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు.

ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి-మడకశిర

ఎమ్మార్పీఎస్ జిల్లా గౌరవాధ్యక్షులు ఎన్ఆర్.నరసింహులు ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని మెలవాయి, మనూరు గ్రామాలకు నూతన కమిటీలను ఎన్నుకున్నారు. మెలవాయి అధ్యక్షులుగా రామంజప్ప, ఉపాధ్యక్షులుగా నరసింహమూర్తి, గౌరవాధ్యక్షులుగా గోవిందప్ప, గౌరవ సలహాదారులుగా వి.నరేష్, ప్రధాన కార్యదర్శిగా సూర్య ప్రకాష్, మనూరు గ్రామ అధ్యక్షులుగా రంగనాథ్, ఉపాధ్యక్షులుగా తిమ్మప్ప, గౌరవాధ్యక్షులుగా శివకుమార్, గౌరవ సలహాదారుగా తిప్పేస్వామి, ప్రధాన కార్యదర్శిగా పి.ప్రకాష్, కార్యదర్శిగా రామాంజనేయులు, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అన్ని మండలాల్లో కమిటీలు వేయాలని ఎన్ఆర్.నరసింహులు, కర్నాటక రాష్ట్ర కార్యదర్శి సాగర్, తాలూకా అధ్యక్షులు గంగాధర్, మానూరు గోవిందప్ప, చౌడప్ప తెలిపారు. కార్యక్రమంలో కృష్ణ, అనిల్, మూర్తి, మణి, నరసింహప్ప, పవన్ కళ్యాణ్, కదురప్ప, గంగాధరప్ప, జగదీష్, రంగదామప్ప, నాగరాజు, తిప్పేస్వామి, రామకృష్ణ, నాగేంద్ర, రంగనాథ్, తదితరులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలపై సమావేశం

ప్రజాశక్తి-లేపాక్షి

లేపాక్షిలో వెలసిన దుర్గాదేవి దసరా నవరాత్రి ఉత్సవాల ఏర్పాట్లపై ఆదివారం ఆలయ కమిటీ ఛైర్మన్ రమానందం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని వారు కోరారు. సమావేశంలో టిడిపి మండల కన్వీనర్ జయప్ప, సర్పంచి ఆదినారాయణ, దేవాదాయ శాఖ అధికారులు నరసింహ, పురోహితులు శీనాస్వామి, సింహాస్వామి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ప్రశాంతి నిలయంలో శ్రీకాకుళం భక్తుల సందడి

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

ప్రశాంతి నిలయంలో ఆదివారం శ్రీకాకుళం జిల్లా సత్యసాయి భక్తులు సందడి చేశారు. సుమారు 4వేల మంది శ్రీకాకుళం జిల్లా నుంచి పర్తి యాత్రగా తరలివచ్చి మహా సమాధిని దర్శించుకున్నారు. బాలవికాస్ విద్యార్థినులు సంప్రదాయ నృత్యాలతో అలరించారు. 4 వేల మంది భక్తులు ఒకేసారి మంగళహారతి ఇచ్చి భక్తిని చాటుకున్నారు. సాయి కుల్వంత్ సభా మందిరం సత్యసాయి నామ స్మరణతో మారుమోగింది. వేలాదిగా వచ్చిన భక్తులతో సాయి మందిరం కిటకిటలాడింది. కార్యక్రమంలో దేశ విదేశీ భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ప్రశాంతి నిలయంలో మంగళహారతి ఇస్తున్న శ్రీకాకుళం జిల్లా భక్తులు

108 వాహనం ఢీకొని వ్యక్తి మృతి

లేపాక్షి : మండలంలోని గొంగటిపల్లి గ్రామం వద్ద ఆదివారం అశ్వర్థప్ప(60) 108 వాహనం ఢీకొని మృతి చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు.. చిలమత్తూరు నుంచి హిందూపురం వైపు వెళ్తున్న 108 వాహనం గొంగటిపల్లి గ్రామానికి చెందిన అశ్వర్థప్పను ఢీ కొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో అతడిని 108 వాహనంలో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడని హెడ్ కానిస్టేబుల్ వెంకటరాముడు తెలిపారు. మృతుడికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. కొడుకు గంగాధరప్ప పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పేకాటజూదరుల అరెస్టు.. బైక్‌లు, సెల్ ఫోన్లు స్వాధీనం

లేపాక్షి : మండలంలోని విభూదిపల్లి గ్రామ శివారులో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై ఆదివారం సిఐ జనార్దన్ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించి నలుగురు వ్యక్తులను అరెస్టు చేశారు. వారి నుంచి రూ. 11,150 నగదు, 6 బైక్‌లు, 6 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పేకాట నిర్వహిస్తున్న విభూదిపల్లి గ్రామానికి చెందిన రామంజితో పాటు మరో 9 మంది పరారయ్యారని ఎస్ఐ మునీర్ అహమ్మద్ తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.